గురి

యం. రామకోటి

"పట్టపగలే యింత చిట్టచీకటిగ వుంది ..

కన్ను పొడుచుకున్నా దారి కనబడ్డం లేదు యిదేం అడవి మహర్షీ? కోట గోడలా దట్టంగా పెరిగిపోయిందీ" అన్నాడు రాముడు విశ్వామిత్రుడి వేపు చూసి

మద్దీ మారేళ్ళూ నేరేళ్ళూ చేవదేరి పోతరించి వున్నాయి చీకటంతా మేసి చీకూ చింతా లేక తీరికగా నెమరేస్తున్నాయి నల్లేర్లూ. అడ్డతివ్వలూ చిక్కులు పడి అల్లుకుపోయి నింగీ నేలా పందిళ్ళు వేస్తున్నాయి. కాలికింద చిత్తడి నేలవూబిలా

ఎమర్జెన్సీ ప్రకటించిన వెంటనే రాయబడిన కథ. పత్రికలపై సెన్సార్ నిబంధనలున్నందున స్వయంగా మేము చేసుకొన్న 'సెన్సార్' కారణంగా ప్రచురించలేక పోయినదీ కథ. —ఎడిటర్

కూరుకుపోతోంది. రేగడిపడియల్లో అడవి పందులు కొమ్ములతో కుమ్మి దుంపలు పెరికి తింటూ గుర్గురుమంటూ గడబిడ చేస్తున్నాయి. గుగ్గిలం దీపాల్లా గుడ్ల గూబల కళ్ళు గుప్పుగుప్పుమంటున్నాయి.

కీచురాళ్ళు చెవులు గీపెడుతున్నాయి.

"యిప్పుడిలా దిక్కుమాలిపోయింది గాని.... ఒకనాడిది కనుపండువైన జనపదం" అన్నాడు విశ్వామిత్రుడు.

జిల్లేడ్లూ, బ్రహ్మచెముళ్ళూ నరుకుతూ లక్ష్మణుడు ముందు నడుస్తూ దారిచేస్తున్నాడు. మహర్షి మాట విని కత్తి చేతిలో వూపుతూ ఆగిచూసేడు.

నిలువెత్తు మనిషి. నిండైనవాడు మహర్షి. కుంకంబొట్టు నుదిటమీద రాజుకునేనిప్పులారువరువలాడుతోంది. తాపిన వజ్రంలా వుంది టోర. లోకాల అట్టుపట్టు ఆనవాళ్ళన్నీ ఆ కళ్ళల్లో మెదుల్తున్నాయి. రాజసం, ఓజసం నిలువెల్లా ధగధగలాడుతున్నాయి.

అది ముందుచూపు. మసగలేనిచూపు. నిజాయితీ నిండుకున్న చూపు. లోకాల క్షేమంమీద గురిపెట్టిన చూపు. ప్రతి అడుగూ నమ్మకానికి జాడ. అది ముందడుగు.

"ఎవరీ మహాత్ముడు" అనుకుంటున్నాడు లక్ష్మణుడు.

మంచు కరిగి అలలుదేరి జారినట్టు. పండుజుట్టూ బొద్దుమీసం గుబురుగెడ్డం అన్నీ కలిసి కదిలొచ్చే వెండికొండలా వున్నాడు మహర్షి.

"ఎందుకోసం ఎవరికోసం.... యీ మహనీయుడిలా ముందుకొచ్చేడు" అని విస్తుబోతూ "జనపదంవా? .... అయితే యీ ముళ్ళకంపలూ డొంకలూ యింత విచ్చల విడిగా యెలా పెరిగిపోయేయి మహర్షీ" అన్నాడు రాముడు.

"అబ్బ! కంపుకంపు" అని ముక్కు మూసుకుని జుమ్మని మీదకి ముసిరిన యీగల గుంపుని తోలుకుంటూ విశ్వామిత్రుడివేపు చూసేడు.

"కంపుకొడుతోందా రామా? ...దేశం వెలా వుందో చూడు .. అది చూపించడానికే నిన్నింత దూరం తీసుకొచ్చేను" అసహాయతలో దైన్యం మహర్షి చూపుల్లో నిండుకుంటోంది.

దుఃఖంలో పెల్లుబికే జాలీదయా తొణికిసలాడుతున్నాయి.

"యిదేం దేశంవంటారు మహాత్మా" యింకా ముక్కు మూసుకునే వున్నాడు రాముడు.

"మలదకరూశం" అన్నాడు మహర్షి.

"అంటే?"

"కుళ్ళూ.... ఆకలీ"

"అదా యీ కంపు. .. అబ్బ! ఎలా వచ్చేయవీ?"

"ఏలిక దొరల వంటి కుళ్ళయ్యా . వాళ్ళ కడుపుల్లో ఆవురావురుమనే ఆకలి."

ఆవేదనలో కాకదేరి, మౌనంలో సానదేరి పదునెక్కుతోంది మహర్షి పలుకు.

"ఏలికదొరలా.... వారెవరు మహర్షీ?"

"ఇంద్రుడు"

"యింద్రుడా! .. యీ కూపంలోకి ఆయనెందుకొచ్చేడూ?"

"పదవికోసమయ్యా.... రామయ్యా అది నిలుపుకోవడంకోసం.... అయిశ్వర్య

మంతా పణంపెట్టి అందరికీ అన్నీ యెర చూపించి ఆకట్టుకుని చచ్చీ చెడి వృత్రుడిమీద దొంగదెబ్బ తీసేడు మన పున్నవాడు వృత్రుడు మనుషుల మనిషి అతడి మనసు ఘోషించింది లోకం వుస్సు రంది ఆ వుసురు తగిలింది యింద్రుడికి. తెంపూ తెగువూలేని అజీర్ణం ఆకలీ పట్టు కున్నాయి. దాంతో కనబడ్డ హోటల్లా పాడు చేసేడు వాడు ఆ కంపు ముల్లోకాలూ ఆవ రించింది కొంప మునిగిందిరా బాబూ అనుకుంటూ యీ భట్టుగాళ్ళందరూ యేలిక దొర చుట్టూ గుమిగూడేరు "

"భట్టులా వాళ్ళెవరు మహర్షీ?"

"ఇంకెవరయ్యా అధికారం చుట్టూ, మూగే యీగలు యిందాక నీ మొహం మీద జుమ్మని ముసిరేయి చూడు అవే ఓ అందరూ ఋషులే "

పక్కన నవ్వొచ్చింది లక్ష్మణుడికి అన్నగారి కంట్లో యెర్రజీర చూసి నవ్వాపు కుని బిర్ర బిగుసుకుపోయి కళ్ళప్పగించి చూస్తున్నాడు

"ఆఁ చేరేంచేసేరు వాళ్ళంతా?" అన్నాడు రాముడు

ఆ యింద్రుడిగారికి అమృత రసా యనం పట్టించేరు వైద్యం చేసి పథ్యం పెట్టించేరు దాంతో వాడు తేరుకున్నాడు కంపుకొడుతున్నాడు ఒళ్ళంతా మురికి నలుగుతోంది సీడపట్టి వున్నాడు అది చూడలేక శౌచమంత్రాలు చదివి మంగళ స్నానాలు చేయించి మళ్ళీ మనిషినిచేసేరు బతుకు జీవుడా అనుకుంటూ వాడు స్వర్గా నికి పోయేడు పోయినవాడు పోరాదూ పోతూ పోతూ వాడి మలినాన్నీ ఆకలినీ యీ సీమకి అంకితంచేసి మరీపోయేడు అది పాలకుల గుణంలా వుంది లేక పోతే అదేం పోయేకాలం ఆ కుళ్ళూ ఆకలీ భరించిన సీమగనక యీ ప్రాంతాన్ని మలదకరూశమన్నారు" మహర్షి మాట ల్లోనూ చూపులోనూ అసహ్యం నిండి పోయింది

"అంటే మీ రనేది యీ నేలపాల కుల రోగాలరొంపి అన్నమాట" అన్నాడు రాముడు మహర్షిమాటలో అంతర్యాన్ని అందుకోబోయి

"కాదు కాదువాళ్ళ కుతంత్రాల కంపు రాజకీయాల రంకు అదే తరతరాల వారసత్వంలా మనల్ని వెంట తరుము తోంది అదే నీ ముక్కుపుటాల్ని బద్దలు చేస్తోంది."

పదహారేళ్ళ పచ్చదనంలో నవనవ లాడుతున్నా రన్నదమ్ములు వయసు బిగు వెక్కుతోంది కొత్త సంగతులు వింటు న్నారు వాళ్ళ చూపులు చురుకెక్కుతు న్నాయి దారీ తెన్నూ లేని డొంకలమధ్య వున్నారు వాళ్ళు కొరివి తగిలించిన బాణంలా ముందుకి దూసుకు వెళ్తున్నాడు మహర్షి వాళ్ళకి దారి కనబడుతోంది

ఆవేశం ముంచుకొస్తోంది లక్ష్మణుడికి అమ్మవారు పూనినట్టు తూగిపోతూ కంపల్నీ బ్రహ్మచెముడు డొంకల్నీ ఒక్క వూపులో చెండాడి పారేస్తున్నాడు దారి సాపుచేస్తూ విషప్పురుగులు చాటుమాటు కాటు వేయకుండా, అడ్డతివ్వలు ముందు కాళ్ళకి బంధం వెయ్యకుండా వెయ్యి కళ్ళతో కాపలా కాస్తున్నాడు

"ఆగేరేం మహర్షీ?" అన్నాడు రాముడు

వెనకబడిన మహర్షిని చూపి

అటూ యిటూ అలుముకున్న చెట్టూ చేమా అలజడిపడుతున్నాయి వాటి వెనక యేదో హడావుడి జరుగుతోంది

"మనజాడ పసిగడుతున్నారు" అన్నాడు మహర్షి అనుమానంగా కలయజూస్తూ

"ఎవరు మహర్షీ" విల్లుమీద చెయ్యివేసి కళ్ళు పెద్దవిచేసిచూసేడు రాముడు

"వేగులూ వంతగాళ్ళూ మేత మరిగిన మల్లులూ ఒకరేవిఁటి" నవ్వుతున్నాడు విశ్వామిత్రుడు

"ఎవరూ!"తిరిగిచూసే రన్నదమ్ములు

మారేడు రొడ్డనీ రేగు చిగుళ్ళనీ తొండాలెత్తి మడిచి తుంపిలాగి జాడిస్తున్నాయి మదగజాలు దేవదారుల మాకుల్నీ మద్దిమానుల్నీ దంతాలతో ఒక్క పెట్బలో కూల్చి పారేస్తున్నాయి ముందుకాళ్ళెత్తి మీదబడబోయేయి

నారితెగిన వింటిబద్దలా చివ్వున లేచి కత్తి యెత్తేడు లక్ష్మణుడు నవ్వుతున్న మహర్షిని చూసి తొండాలెత్తి ముడిచి వంగి దిగి వెనక్కి వెళ్ళిపోయేయి

"అంగబలం చూపిస్తున్నాయి రామా!" అన్నాడు విశ్వామిత్రుడు

"ఏనుగులు మహర్షీ!" అన్నాడు రాముడు

"ఆవేనయ్యా ఆవిడ బలఁవూ బలగఁవూనూ ఆవిడ చలవవల్లె అవి అలా మదించి మనగలుగుతున్నాయి పిలుస్తే చాలు కుంభస్తలాల్లో దాచిపెట్టిన ముత్యాలన్నీ ఆవిడ ముందు గుమ్మరిస్తాయి ఊఁ అంటే వాళ్ళమీద పడి అల్లకల్లోలం చేస్తాయి."

"ఆవిడెవరు మహర్షీ?"

"యీ మన్యానికి మహారాణీ"

"మహారాణీయా ఎవరు మహర్షీ?"

"తాటక" మహర్షి కళ్ళు చురచురలాడేయి

"జనపదం అన్నారూ రాణీ యెలా అయిందీ?" సందేహంగా చూసేడు రాముడు

"రాణీనని చెప్పుకుంటుందా మహాజనుల కోరికమీదే మహారాణీలా చెలాయిస్తోంది ఆవిడ ఆడింది ఆటా పాడింది పాటా!"

"అదెలా వీలయిందీ?"

"అదే గడుస్తనం యీ కటిక చీకటిని చిక్కబట్టి మసిపూసి యీమారేళ్లూ నేరేళ్ళూ దట్టంగా పెంచి యీ అద్దానపడవిలో పళ్ళు దుళ్ళగొట్టించి పంచిపెట్టించి వెర్రిమాలోకాల్ని బుట్టలో వేసుకుని రాలుగాయిల్ని రాఁగొట్టించి అదలించి బెదిరించి అందలం యెక్కూచుంది అయిదేసేళ్ళ కోమారు జాతర చేయించి యీ యేనుగుల అంబారీమీదే వూరేగుతుంది పులుల్నీ సింహాల్నీ తొక్కి పారేయించి నక్కల్నీ కుక్కల్నీ చేరదీసి చిత్తులుపన్నించి వేటాడించి గొర్రెల మందల్ని తోలుకొచ్చి చివరికి వాటి బొచ్చుకూడా మిగలకుండా నొల్లె మింగేస్తోంది"

"అసాధ్యురాలే యింతకీ ఆవిడెవరు మహర్షీ?" అన్నాడు రాముడు కుతూహలంగా

"ఒక యక్షిణి" చింతనిప్పుల్లా చిట



పటలాడేయి విశ్వామిత్రుడి కళ్ళు

"యక్షిణా? . వాళ్ళంత బలంవైనవాళ్లు కారని విన్నానూ "

బలంవంటే కండబలంవేనటయ్యా? అధికారానికున్న పొగరు అది ఆ గద్దెమీద కూచుంటే చాలు యెక్కడలేని వికారాలూ పుట్టుకొస్తాయి రానురాను నీకూ బోధ పడుతుందిలే" మహర్షి పెదాలు చిరునవ్వుతో విచ్చుకున్నాయి

"యక్షులు హిమాలయాల్లో వుంటా రంటారూ?" అన్నారన్నదమ్ములు

"అవును నిజంవే, యీవిడ పూర్వీకు లందరూ హిమాలయం వాళ్ళే . మన కోసం యిక్కడికికూడా దాపురించేరు తండ్రీ సుకేతుడనీ వాడికి చదవేస్తే వున్న మతిపోయింది జపాలూ తపాలూ చేసి యీ పిశాచప్పిండాన్ని కని మనమీద పారేశాడు . వయసొచ్చి వన్నె హెచ్చి సొగసు పెరిగి వలపులు పొంగి పింగా రాలు రంగరించుకునే కూతుర్ని చూసి మురిసిపోయేడు."

"ఏ తండ్రి మురిసిపోడు మహర్షీ?" అమాయకంగా చూసేడు రాముడు

"అవునయ్యా కాకిపిల్ల కాకికి ముద్దని నాకూ తెలుసు . కాని అది రక్కడం మొదలెడితేనే అందరికీ యిబ్బంది. ."

"కాకేం రక్కుతుంది మహర్షీ?"

"కోటలో పెరిగిన గువ్వపిట్టలు ఆ రక్కల మంట మీకేం తెలుస్తుందయ్యా మీకూ మీ వాళ్ళకీ తగిలిందాకా తెలీదు రక్కల బాధ "

"ఏవింటి మహర్షీ?"

"గోళ్ళ తో నే రక్కుతాయనుకోకు రామయ్యా ముక్కుతో పొడుస్తాయి

కావు కావుమని గగ్గోలపెట్టి నువ్వు మని షివే కావని నీచేతే ఒప్పిస్తాయి ఆ గోల కెంత బలంవో అబద్ధాని కెంత పెద్దనోరో గద్దెక్కిన తరవాత నువ్వే చూస్తావు" ఆప్యాయంగా వెన్ను చరిచేడు మహర్షి

''సాహసించి అడుగుతున్నాను నా అవివేకాన్ని మన్నించండి మహర్షీ" వినయంగా రెప్పలు వాల్చేడు రాముడు.

"అది అవివేకం కాదయ్యా కుతూహలం ఎదగడానికి ముందుమెట్టు నీకు యింకా యెన్నో చెప్పాలయ్యా నా సర్వస్వం నీకు ధారపొయ్యాలి నా జన్మ సార్థకం కావాలి "

పోటెత్తిన పాలకడలిలా పొంగుతోంది విశ్వామిత్రుడి వక్షం ఉప్పెనలా వుబికి పోతున్నాడు

"తాటక కథ మహర్షీ!" మెల్లిగా జ్ఞాపకం చేసేడు రాముడు

"అవునవును తాటక జపం వదిలి మరెందులోనో పడ్డాను వయసు మళ్లుతోంది బుద్ధి మందగిస్తోంది అందుకే మరీ నిన్ను వెంట బెట్టుకురావడం ఆఁ ఆఁ " నవ్వుకున్నాడు మహర్షి.

"ఆవిడ కథ " అందించే రన్నదమ్ములు

"సుకేతుడి కూతురని చెప్పేను కదూ

వాడు పండితుడూ లోకాల పుట్టు పూర్వోత్తరాలూ దేశాలూ రాజులూ రాజకీయాలూ అన్నీ రంగరించి దానికి వసబోసేడు. దేశదేశాలూ తిప్పి చూపించి అరిటిపండులా అనుభవాన్ని చేతిలో వొలిచిపెట్టేడు వెదకి వెదకి సుందుడికిచ్చి ముడిపెట్టేడు వాడి అబ్బగారి సొమ్ములా యీసీమని కూతురికి అరణం ఇచ్చేడు "

"సుందుడంటే సుందోప సుందులంటారు అందులో వాడేనా?"

"వాడే ఆ పొగరుమోతు ముక్కు మూసుకుని జపం చేసుకుంటున్న అగస్త్యుడి ముందు ప్రతాపం చూపించబోయి కుప్పి గెంతులేసేడు ఆయన కోపంతో కన్నెర్రజేస్తే రారుమని చచ్చూరుకున్నాడు "

"పాపం'' నొచ్చుకున్నాడు రాముడు

"అలాగే అనుకున్నాడు అగస్త్యుడు కూడా మొగుడు పోయేడని రెచ్చిపోయే తాటకిని ఓదార్చి, బుజ్జగించి, మన్యంలో అందరినీ పిలిపించి ఒప్పించి గద్దెక్కించేడు ఎక్కీ యెక్కగానే గాంఢ్రు గాంఢ్రుమని అతగాణ్ణే వెంట తగిలింది. కక్కలేక మింగలేక కోపం తెచ్చుకుంటే మొదటికే ముప్పొస్తుందని ఆ ధాటికి తట్టుకోలేక కృతఘ్నురాలా నామీదే తిరగబడతావుటే అని యేడ్చుకుని కచ్చ సద్దుకుని వింధ్యపర్వతం దాటిపోయి దక్షిణాపథంలో తలదాచుకున్నాడు అది చూసి యీ అడవి గూడెం అంతా యిందాక నీమీద జుమ్మని మూగేయి చూడూ అలా గుంపులు గుంపులుగా యింక లాభం లేదనుకుని ఆవిడ చుట్టూ కొలువుకి కుదిరిపోయేరు "

"తరవాతేమైంది మహర్షీ?''

"ఏంవవుతుందయ్యా నిలదీసి అడిగేవాడు లేక విచ్చుకత్తిలా రెచ్చిపోయి వీరవిహారం చేసింది తాడూ బొంగరం లేని దిక్కుమాలిన వాళ్ళ రక్తం తోడేసి డొక్కలు చీల్చి పేగులుతీసి గద్దెమీద



దర్భాసనంలా వేసుకుని ధర్మపన్నాలు వల్లిస్తూ మరీ రాజ్యం చేస్తోంది."

"అంతటిదేం చూడవలిసిందే " అమ్ముల పొదిలో అంపకోలలు సవరించు కున్నా రన్నదమ్ములు.

"చూద్దురుగాని. అదిగో ఆకంతదాటి ఆపుంతమళ్ళితే అదే తాటకవనం మీ అయోధ్యకీ విదేహానికీ పొలిమేర . అదిగో ఆ గుట్ట చూడండి . .దాని మీదో బండరాయుందేం అదే ఆవిడ గద్దె . వృత్త పాషాణం అనుకునేరు. మణులూ మాణిక్యాలూ తాపినవేదిక .... దానిమీద చూడాలి మన్నె దొరసాని బిగువు."

"ఇన్ని ఆగడాలు జరుగుతుంటే . అన్నిశక్తులూ గుప్పిటలో వుంచుకుని . చూస్తూ వూరుకున్నారేం మహర్షి. " అన్నాడు రాముడు.

అమాయకంగా అడుగుతున్నారా గడుసుగా నిలదీస్తున్నారా? నా శక్తిని అనుమానిస్తున్నారా చిత్తశుద్ధిని శంకిస్తున్నారా? ఆలోచనలో పడ్డాడు మహర్షి.

"మౌనం వహించేరేం మహాత్మా . తొందరపడి మీ మనసు నొప్పించ లేదు గదా? మన్నించండి."

రాముడి చూపుల్లో వినయం తొణికిసలాడుతోంది.

"అహ. అదేంలేదయ్యా .." ఆ అన్నదమ్ముల కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి చూసేడు మహర్షి.

స్ఫటికంలా నిర్మలంగా వున్నాయి. కపటం మచ్చుకేనా కనబడ్డంలేదు. తొలకరిస్తున్న వయసు, మలినం కాని మనసు కల్మషంలేని బుద్ధి వీళ్ళది. అనుకున్నాడు

ఈ పసివాళ్ళకి యీ ధర్మ సంకటం

యెలా విడమర్చి చెప్పడం. మథన పడు తున్నాడు

"ఏం మహర్షీ వూరుకున్నారూ" దీనంగా చూసే రన్నదమ్ము లిద్దరూ

"ఆ కీర్తి మీకు దక్కాలి నాయనా" నవ్వుతూ చూసేడు విశ్వామిత్రుడు

"మాకా!" తెల్లబోయి చూసేదు రాముడు

"చూడు రామయ్యా కుత్సితాలతో కుతంత్రాలతో, మాయలతో, మత్సరాలతో, స్వార్థంతో, స్తోత్రపాఠాలతో మీ ముందు తరం కుళ్ళిపోయింది పుస్తకాలు పిండి కొట్టి కొట్టి సిద్ధాంతాలూ, సూత్రాలూ వల్లించి వల్లించి లౌక్యం మరిగి కపటం నేర్చుకుని సారాన్ని గాలికి వదిలి పొల్లు పంచిపెడుతున్నారు బుద్ధిని పడుచుకుంటున్నారు మీకింకా మే బురదా అంటలేదు పదునెక్కుతోంది మీ బుద్ధి కాని రెండువేపులా కాదు అందుకే ముందుగా మేలుకున్నాను నా వూపిరి పోసి రాజేస్తున్నాను మీరు చాలా మెలకువగా వుండాలి రామా" అన్నాడు విశ్వామిత్రుడు

"మాదాకా యెందుకు రానిచ్చేరు మహర్షీ?"

"కాలం రామా అది కూడా కలిసి రావాలి చూడు రామయ్యా నా లక్ష్యం రు లోక క్షేమం యీ దెయ్యాలవేట ందు నా నిగ్రహం యీ రాక్షసులకోసం వ్యర్థం కాకూడదు అందుకోసమే రాజ ంానికి తిలోదకాలిచ్చి క్షాత్రాన్ని త్యజించి యీ దీక్ష పూనేను రేపో మాపో యీ సీమని యేలుకోవలసిన వాడివి యీ పుణ్యం నీ చేతిమీద జరగాలి అప్పుడే జనం నీ వెంటబడతారు నీకు మనసా పట్టం కడతారు" అన్నాడు విశ్వామిత్రుడు

"నేనా!" అన్నాడు రాముడు

"ఆఁ నువ్వే ఏం?"

"ఆడదానిమీద అమ్ము లేయమంటారా మహర్షీ" తల వాల్చుకున్నాడు రాముడు

"అదా నీబాధ? చూడు రామా క్రూరమైనా, అక్రూరమైనా, పాపమైనా, అపవాదకరమైనా ప్రజారక్షణకోసం యేం చేసినా తప్పుకాదయ్యా యీ సూక్ష్మం తరతరాల ధర్మం ఇది రాజనీతి శృతులుకూడా యిదే చెబుతున్నాయి లోకాల్ని మింగేస్తున్న మహమ్మారి ఇది వెనుకాడవలసిన అవసరం లేదు రామయ్యా"

"నా అవివేకాన్ని మన్నించండి మహాత్మా మా తండ్రిగారు మీరేం చెబితే అది చెయ్యమన్నారు నా మనసు కూడా అదే చెబుతోంది. మీ దయ నాకు దీవన నాకింకే అనుమానమూ లేదు చెప్పండి యేం చెయ్యమంటారో" చేతులు జోడించేడు రాముడు

"ఈ మూగ జీవాలకి యీ పిశాచం చెరవిడిపించు వాళ్ళకి భయంలేని బతుకు చూపించు అంతే" అంటూ ఆవేశంలో రాముణ్ని కౌగలించుకుని" నువ్వు నా అంతర్యామివి నా తపనా తపస్సూ అన్నీ నువ్వే నా శిక్షణలో నువ్వు పురుషోత్తముడివి కాబోతున్నావు రామా! రామచంద్రా నాయనా" అని నుదుటి మీద మనసారా ముద్దుపెట్టుకున్నాడు

జ్యోతి

విశ్వామిత్రుడు.

ఉప్పొంగిపోతున్న తమ్ముడి వేపు ఓరగా చూసేడు రాముడు. భుజంమీద చెయ్యివేసి "మీ అభిమానం మహర్షీ కృతజ్ఞులం" వినయంగా వందనంగా వంగిపోయేడు

"ఎంత సూక్ష్మబుద్ధి రామా" అని అన్నదమ్ము లిద్దర్నీ చెరో భుజంకిందా చేర్చుకుని దండకమండలాలు లక్ష్మణుడికి అందించేడు మహర్షి

"అపరాహ్నం దాటిపోతోంది మహర్షీ" అన్నాడు లక్ష్మణుడు చెయ్యడ్డం పెట్టుకుని పొద్దు చూస్తూ

"సమయం మించిపోతోందని చెబుతున్నావా బాబూ అవునవును పొద్దు కూకకముందే ఈ నరకం దాటిపోవాలి" లక్ష్మణుడి వీపు తట్టేడు విశ్వామిత్రుడు

దుమ్ము రేగుతోంది కిలుకు కిలుకుమంటూ చిరుగంటల మోత వినబడుతోంది

"గొర్రెలమంద మహర్షీ" అన్నాడు రాముడు తప్పుకుంటూ

"ధూళి కమ్మింది సరిగా చూడవయ్యా" నవ్వేడు విశ్వామిత్రుడు

"మనుషుల్లాగున్నారు అవును మనుషులే" కళ్ళు చికిలించి చూసి "అయ్యో అయ్యో అదేంకర్మం అలా చేతులూ, కాళ్ళూ ఒకలాగే నేలమీద ఆని నడుస్తున్నారా పిల్లు పాకుతున్నారా? గూనొచ్చినట్టు అలా ఒంగిపోయేరేవిటీ?"

"వెన్ను విరిగిపోయి. ధర్మం నాలుగు పాదాలా నడుస్తోంది రామచంద్రా చూడు వాళ్ళ చూపులూ వాలకాలూ నిర్భయంగా చూస్తున్నారా? కళ్ళెత్తి చూస్తున్నారా? చూడవయ్యా చూడు"

"ఇంత దైన్యంవా' ఎవరు మహర్షీ యీ దౌర్భాగ్యులు?"

"మహాజనులు ఆమహారాణీ ప్రజలు"

గుట్ట దగ్గరవుతోంది ఈదురుగాలి చెలరేగుతోంది రక్తం గక్కుకుంటోంది వాలు పొద్దు మబ్బు మసగాలేకుండానే రెప్పపాటులో జారిపడే గొంగళీలా చీకటి ముంచుకొస్తోంది ఊపిరాడక గాలి బిక్కచచ్చిపోయింది కీ కీ అంటూ తీతిక అరుచుకుంటూ యెగిరిపోయింది

"మహర్షీ!" మనసు కలుక్కుమని కలత బడ్డాడు రాముడు

"తాటక వనంలో అడుగుపెట్టేం రామచంద్రా! ఎవరూ చెయ్యలేని సాహసం చేస్తున్నాం" రాముడి భుజంతట్టి ముందుకి నడిచేడు మహర్షి

చిరతలూ పివంగులూ దారికడ్డుగ పచార్లు చేస్తున్నాయి తొర్రల్లోంచి మోరలు సాచినక్కలేడుస్తున్నాయి రాబందులు నెత్తిమీద గిరికీలు తిరుగతున్నాయి

"అపశకునాలు మహర్షీ" అన్నారన్నదమ్ములు

"అన్నీ మీకు శుభాలే పదం పదండి ఈ వల్లకాడు దాటితే చాలు అదిగో అదే మన సిద్ధాశ్రమం అదే మ లోకం. అక్కడ శుభాలు పండుతాయి అందాలు విరుస్తాయి ఆనందాలు కు స్తాయి పదండయ్యా పదండి యిప్పే అడ్డగలవు మిమ్మల్ని" అంటూ ఆ కుంటూ భుజాలమీద చేతులేసి అ

దమ్ముల్ని ముందుకి తోసేడు మహర్షి

భగ్గు భగ్గుమని కొరివిలు యెదురొస్తు న్నాయి భౌ భౌ మంటూ గుంపులు గుంపులు జాగిలాలు తోకలాడిస్తూ ఒగర్చు కుంటూ ముందుకి దూకుఁ న్నాయి అప్పుడే గుచ్చితీసిన కొత్త పేగుల్లా వున్నాయి మెడలో యెర్ర పట్టీలు పగ్గా లతో యెవరో వెనక్కి లాగుతున్నారు

కన్నెత్తి చూసే రన్నదమ్ములు

నెలవంకలా నవ్వుతోంది జువ్వల్లా చూపులు రువ్వుతోంది వెన్నెల మడుగు లోంచి ముంచి తెచ్చినట్లుంది చీర పచ్చగా దబ్బపండులా మిసమిసలాడుతోంది

"ఈవిడేనా మహర్షి" అన్నాడు రాముడు వింతగాచూస్తూ

"ఆఁ ఈవిడే "

"య క్షి ణీ అన్నారా పిశాచ న్నారా?"

"అలాఅని నూరిపోసేరా మీ మహ ర్షులూ?" యీసడింపుగా విశ్వామిత్రుడి వేపోమారు చూపి ఆ అన్నదమ్ములమీదకి చూపు మళ్ళించింది

తేరిపార చూసింది

కలువ మొగ్గల్లా కాటుకకళ్ళూ, నూ నూగు మీసాలూ, ఏపుగా పెరిగి మృగ రాజుల్లా మదగజాల్లానడుస్తున్నారు ముక్తా మొహంతీరు చూసింది, చిక్కితే పాలు గారేలా వున్నారు

"సొగసులన్నీ మీరే పంచేసుకున్నారు రాజుల చిన్నవాళ్ళలా వున్నారు ఏదీ బాబూ యిలారండయ్యా ముద్దొస్తు న్నారూ " ఆప్యాయంగా అన్నదమ్ము లను చేరదీసుకోబోయింది తాటక.

దూరంగా జరిగిపోయేరు వాళ్ళు

"తప్పుకో " అన్నాడు విశ్వా మిత్రుడు

"హుఁ జాతరలో జనాన్ని మెప్పిం చలేక పందెంలో ఓడిపోయి ఉడు క్కుని మాయాపన్నాగం పన్నేవా సన్నాసీ" పళ్ళుకొరికింది

"ఏం వాగేవ్?" రాజుకు పోయేరన్న దమ్ములు.

బెదిరి అడుగువెనక్కి తగ్గింది తాటక

"చూడండి బాబులూ నా మాట వినండి వాళ్ళపాటకి నేను గజ్జెకట్ట లేదని తగబట్టి అలగాజనాన్ని రెచ్చగొట్టి

మీ చదువులు మంటగలిపి యిలా మిమ్మల్ని వుసిగొలుపుతున్నాడీ జిత్తుల మారి చేతగాక మిమ్మల్ని పావు లుగా వాడుకుంటున్నాడు చదువుల్లో ఆరితేరి లోకాన్ని ఉద్ధరించాలి మీరు యిలా చదువూ, సంధ్యామాని అల్లరి మూకలోచేరిపోతారా ఎవరికి నష్టం ఆలోచించండి నా మాట నమ్మండి నేనేం చేసినా మీకోసఁవే " అభిమానం ఒలకబోస్తూ మాటలు చెరుగుతోంది

"ఏం చదువులు నంగనాచీ నీదా సులు చెప్పే పారాలేనా నీసేవకులువాగే ధర్మసూత్రాలేనా? ఆ బడిలో చెప్పేది చదువులుకావు కువిద్య ఆసంగతి ఈ యువకులు యేనాడో పోల్చుకున్నారు యింక నీ పప్పులుడకవు నీఆట కట్టు దీంతో మనకేవిఁటి పదవయ్యారామయ్యా ముందుకి పద" విసురుగా ముందడుగు వేసేడు విశ్వామిత్రుడు

వెనక్కి తగ్గింది తాటక యీ పెలూ



బల్లాలూ పట్టుకుని చుట్టూకాపలా కాస్తున్నా రాకాసిమూక సైగకోసం చూస్తున్నారు

అలసిపోయి డొక్కలెగరేస్తూ నాలికలు వేలాడించి అంగలారుస్తున్నాయి వేటకుక్కలు

"అన్ని కుక్కలెందుకు మహర్షీ!" అన్నారన్నదమ్ములు

''మనని వేటాడడానికి''

"అందుకు కుక్కల్నా పెంచడం?''

"ఆవిడ నాన్న పులిపిల్లల్ని పెంచేడు" అని ముందుకు నడవబోయి గోడ కట్టేసిన సైన్యాన్నిచూసి "అడ్డులే'' అని గర్జించేడు విశ్వామిత్రుడు

ఆ వూపులో ఆ కాపలాదారుల్ని తోసుకుని ముందుకు పోబోయేడు తాటక వైపు చూసేరువాళ్ళు అగమని కనుసైగ చేసి "ఒరే పులీ బూచిగా పివంగి భైరవా కాలనాగూ చూస్తారేం రా డూః'' అంటూ పగ్గాలు వదిలిపెట్టింది.

గురకలుపెట్టి నిప్పులు చిమ్ముతూ ముక్కుల్లోంచి అగ్గిగుళ్ళు కురిపించి మహర్షిమీదికి ఉరికేయి జాగిలాలు అమాంతంగా తిరగదోసి కాళ్ళమీదా భుజాలమీదా కండలుకొరికి రక్కడం మొదలుపెట్టేయి

"మహర్షీ మహర్షీ!'' అంటూ కుక్కల్ని అదిలించి మహర్షిని లేవనెత్తేరు అన్నదమ్ములు

వాళ్ళ భుజాలమీద లేచినిలబడుతూ

"పోగాలం దాపురించినపుడు ఇలాంటి బుద్ధులే పుడతాయి యీ కుక్కల్ని చూసుకునేగా మిడిసిపాటు " రక్తం తుడుచుకుంటూ ఆగ్రహాన్ని అణచుకుంటున్నాడు విశ్వామిత్రుడు.

"మాకంటిముందే మీకీ అవమానం

జరిగింది మమ్మల్ని క్షమించండి మహాత్మా చెప్పండేం చెయ్యమంటారో చెప్పండి చెప్పండి'' వాపోతున్నాడు రాముడు

దూసుకొచ్చే అగ్గిపిడుగులా ముందుకి దూకింది తాటక ''ఏం చేస్తార్రా కుర్ర కుంకల్లారా! మీబాబులే నాజోలికొచ్చి మన్నుగొట్టుకు పోయేరు మీరనగా యెంత " మొలమీద చేతులేసుకొని వెకిలినవ్వులు వురుముతోంది

ఇనప చువ్వల్లా తలపాయలు నిక్క బొడిచేయి మిడిగుడ్లు తిరిగి కణకణ లాడుతూ కళ్ళు చంద్రనిప్పులు చెరుగు తున్నాయి కోరలు పెరిగి పెదవులచివర పొడుచుకొస్తూ పులిగోళ్ళలా వంగుతు న్నాయి పళ్ళసందుల్లో మనుషుల తలలు పటపట నలిగిపోతున్నాయి కారే పచ్చి రక్తం చేతి కపాలం కప్పెరలోనిండి తొణికి కారిపోతోంది

పిచ్చెత్తినట్టు చిందులు తొక్కుతోంది తాటక. నేల అదురుతోంది నింగి కుంగు తోంది

"ఏమిటీ అట్టహాసం మహర్షీ!'' కళ వళ బడ్డాడు రాముడు విల్లందుకుంటూ

"మాయలమారి ఊసరవెల్లి అదయ్యా దాని అసలురూపం చూసేవా గడియ కోవేషం గంటకో పన్నాగం ఇంకా చూస్తావేం రామా!" అన్నాడు విశ్వామి త్రుడు.

వింటి బద్దవంచి కొనకి తాడు తగి లించి ఒక్కమారు బారసాచిలాగి బిగువు చూసేడు రాముడు టంగుటంగుమని అడ వంతా గింగురుమంది గుండెల్లో పిడుగు పడ్డట్టు. గడగడలాడింది తాటక. ఒక్క మారు ఆలోచించి.

"ఒరే ఒరే హహహా! నన్నేం చేయగలర్రా " అంటూ మాయమై పోయింది

"ఏదీ ఏదీ" నలుదిక్కులూ చూస్తున్నా రన్నదమ్ములు

చీకటి ముసౌ్తోంది చల్లారిన బొగ్గులా పొద్దుమొహం మాడిపోయింది గాలి బిగుసుకు పోయింది. పెద్దకాలం మీద పడ్డట్టు పెద్దపెద్ద చెట్లన్నీ మొదళ్ళతో తెగి కూలిపోతున్నాయి కొండలమీంచి బండలు దొర్లుకొస్తున్నాయి రాళ్ళవాన కురుస్తోంది పొగలా దుమ్ము కమ్ము కొస్తోంది.

"గారడీమొదలయింది కాచుకోరామా" వెన్ను చరిచేడు విశ్వామిత్రమహర్షి

ఆగ్నేయ వాయవ్యాస్త్రాలు ప్రయో గించేడు రాముడు రాళ్ళూ, బండలూ నుగ్గు నుగ్గయిపోయేయి. మండి మండి మాకులన్నీ నుసారిపోయేయి చీకటి పరుగు లంకించుకుంది

వికృతంగా అరుస్తూ గాలిలో యీదు తోంది తాటక

''ఏమిటా అరుపులు మహర్షీ!'' అని ధనుస్సులు సంధించి దిక్కులుచూస్తూన్నా రన్నదమ్ములు

"కపట భాషా నాటకం వినురామా విను ప్రజల క్షేమం కోసం ఆవిడనానా అగచాట్లూ పడుతోందట మంచి చేదామను కుంటే మనం అడ్డుతగుల్తున్నామట . మనం దుండగులం . మూగజీవాల నోళ్ళు కొట్టే తుంటరులం .. జనం బలంలేని

ఒంటరులం .యింకావిను . ఆకాశంలో ఆవిడ వాణి ప్రజాక్షేమం కోసం ఆవిడ ఆవేదన . వినువిను''

పొద్దుకూకుతోంది కూలబడ్డ కారు దున్నపోతుల్లా కొండలు నల్లబడుతున్నాయి

"మాట మణిగిందా, మనతరం కాదు దీన్ని నిగ్రహించడం సమయం మించి పోతోందిరామా''హెచ్చరించేడు మహర్షి

"గాలిలో కలిసిపోయి అల్లరిచేస్తోంది మహర్షీ!" అన్నాడు రాముడు విల్లు యెక్కుబెట్టి

"ఎదురుబడితే మాత్రం ఏం చేస్తావురా ."గండ భేరుండంలా బారలుసాచి మీద పడబోయింది తాటక

పడమరను కబళిస్తున్న హస్తాన్ని ఒక్క అర్ధచంద్ర బాణంతో తుంచిపారేశాడు రాముడు గదలాంటి కోలవేపి తూర్పు నందుకోబోయే చేతికీళ్ళనందులు విరగ్గొట్టేడు. పక్షవాతం పడ్డట్టు వాలిపోయి వేలాడుతోం దాచెయ్యి గిజగిజ తన్నుకొని బాంద్రు బాంద్రుమనిమీద పడబోయి బెదిరి మళ్ళీ మాయమైపోయింది దిక్కులు పగలగొడుతూ గగ్గోలు పెడుతోంది

''అదిగో అరుస్తోంది ఇదే అదను రామా శబ్దభేదిని ఆశ్రయించు బ్రహ్మాస్త్రాన్ని ఆవాహనచెయ్" విశ్వామిత్రుడికి కోపం రగుస్తోంది

ఉడుము చర్మంతొడుగు చేతికి తొడిగేడు రాముడు, విల్లుకి అమ్ముతొడిగి కాలు ముందుకుసాచి, నారి చెవిదాకాలాగి నిల్చున్నాడు

"ధర్మంలా నీవిల్లు ఒళ్ళు విరుచుకుంటోంది ..సరళత్వంలా నారి హుంకరిస్తోంది నీసంకల్పం తిరుగులేనిఅమ్ము ముందు తరంమీది మీ అమ్ము వమ్ము కాదు వెయ్ బాణం వెయ్"

అమ్ము రగుస్తోంది అగ్గిరవ్వలు చిమ్ముతోంది పొగరేగుతోంది. దెబ్బ తిన్న బెబ్బులిలా బొబ్బలెడుతోంది తాటక

"అదిగోశబ్దం గురిచూడు యీ దెబ్బతో యీదేశానికి పట్టినపీడ వదలిపోవాలి యువతమీరు రేపటి నవత మీరు మీద్వారా ధర్మవిజయం జరగాలి" ఘోషించే వేదఋక్కులా పలవరిస్తున్నాడు విశ్వామిత్రుడు

"జయీభవ దిగ్విజయీభవ"

గుండెల్లో రక్తం కరుడుగడుతోంది. గంగిళ్ళెత్తుతుంది తాటక వెకిలి నవ్వు నవ్వుతోంది

పసిచూపు రాకాసిమీద పడింది

గురిచూస్తున్నాడు

రాముడు

గురిచూస్తున్నాడు.